సాక్షి
మెదక్
బుధవారం, 30, జూలై, 2025



నార్సింగి మండల కేంద్రంలో పెన్షన్ కోసం బారులుతీరిన లబ్ధిదారులు



ఘనంగా నాగుల పంచమి

పెద్దశంకరంపేట (మెదక్): జిల్లావ్యాప్తంగా మంగళవారం నాగుల పంచమి పండుగను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని మహిళలు ఆలయాలు, పుట్టల వద్ద నాగదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు.

పింఛన్ కోసం బారులు

చిన్నశంకరంపేట(మెదక్): మెదక్ జిల్లా నార్సింగి మండల కేంద్రంలోని పోస్టాఫీసు వద్ద ఆసరా పెన్షన్ కోసం లబ్ధిదారులు బారులు తీరారు. సోమవారం నుంచి పింఛన్ పంపిణీ చేస్తుండటంతో లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పోస్టాఫీసుకు చేరుకున్నారు. గతంలో బయోమెట్రిక్ రాని వృద్ధులకు గ్రామ కార్యదర్శి బయోమెట్రిక్‌తో పింఛన్ డబ్బులు వారి ఇంటికి వెళ్లి అందించేవారు. తాజాగా బయోమెట్రిక్‌రాని వారికి ముఖాన్ని స్కాన్ చేస్తుండటంతో వృద్ధులు కూడా పెన్షన్ తీసుకునేందుకు బారులు తీరారు.

న్యూస్‌రీల్

హస్తం హవా కొనసాగాలి

ఉమ్మడి జిల్లా నేతల సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్



టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో తోపాజీ అనంతకృష్ణ తదితరులు

సంగారెడ్డి: ఉమ్మడి మెదక్ జిల్లాలో హస్తం హవా కొనసాగాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ కాంగ్రెస్ నేతలకు పిలుపునిచ్చారు. ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, టీపీసీసీ మెదక్ ఇన్‌చార్జి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర నాయకులతో హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో కృషి చేసిన వారికి నామినేటెడ్ పదవుల్లోనూ, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ తగిన గుర్తింపునివ్వాలని చెప్పారు. కష్టకాలంలో జెండా మోసిన వారితో, కొత్తగా పార్టీలో చేరిన వారికి ఎవ్వరికీ అన్యాయం జరగకుండా చూడాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. సమావేశానికి సంగారెడ్డి నుంచి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంతకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు రూ.20లక్షల రుణాలు

డీసీసీబీ మేనేజర్ కిషన్

పాపన్నపేట(మెదక్): మహిళా సంఘాలకు రూ.20 లక్షల వరకు రుణాలు అందజేసినట్లు డీసీసీబీ మేనేజర్ కిషన్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని మల్లంపేటలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని కోరారు. బంగారు ఆభరణాలపై తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తున్నామన్నారు. విద్యార్థులకు స్వదేశీ, విదేశీ విద్య, వాహన, రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. లాకర్ సదుపాయం కూడా ఉందన్నారు.

వన దుర్గమ్మ సేవలో ఆర్టీఐ కార్యదర్శులు



ఆర్టీఐ సభ్యులకు ఆశీర్వచనం ఇస్తున్న అర్చకులు

పాపన్నపేట(మెదక్): సమాచార హక్కు చట్టం కార్యదర్శులు మంగళవారం ఏడుపాయల వన దుర్గమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆర్టీఐ కార్యదర్శి రాములు, డిప్యూటీ కార్యదర్శి ప్రమీల, సభ్యులు ఉదయం ఏడుపాయలకు రాగా వారికి సిబ్బంది ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికారు. అర్చకులు శంకరశర్మ,పార్థివ శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, ఆర్టీఐ అధికారులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం వారిని శాలువాలతో సత్కరించారు.

ఎమ్మెల్యే, ఎంపీ స్థానాల్లో రిజర్వేషన్ కల్పించాలి

గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జైపాల్ నాయక్

మెదక్ కలెక్టరేట్: పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం ఎమ్మెల్యే, ఎంపీ స్థానాల్లో రిజర్వేషన్ కల్పించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. 2014కు పూర్వం సమైక్యాంధ్ర ప్రదేశ్‌లో గిరిజనులకు 6% లభించే రిజర్వేషన్లు తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 10% పెరిగినట్లు తెలిపారు. రాష్ట్ర గిరిజన జనాభాలో 70% మైదాన ప్రాంతాలైన మహబూబ్‌నగర్, మెదక్, రంగారెడ్డి, నిజామాబాద్, కరీంనగర్, నల్లగొండ, హైదరాబాద్‌లో గిరిజనులకు ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలన్నారు.

ఓడీఎఫ్‌లో వర్క్‌లోడ్ సమస్య తీర్చాలి

కంది(సంగారెడ్డి): ఎద్దు మైలారం ఆయిద కర్మాగారం(ఓడీఎఫ్)లో వర్క్‌లోడ్ సమస్యను తీర్చాలని బీఎంఎస్, ఓఎఫ్‌ఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలో ఎంపీ రఘునందన్‌రావు ఆధ్వర్యంలో రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓడీఎఫ్‌లో వర్క్‌లోడ్ లేక ఉద్యోగులు కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొత్త ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు భూమి, రైల్వే, సోలా ర్ తదితర సౌకర్యాలు ఓడీఎఫ్‌లో ఉన్నాయని తెలిపారు. ఓడీఎఫ్‌కు బీఎంపీ 3 వర్షన్ వర్క్‌లోడ్ కల్పించాలన్నారు. సీనియర్ ఉద్యోగులు రిటైర్మెంట్ అవుతున్నందునా డైరెక్ట్ రిక్రూట్మెంట్‌కు అవకాశం కల్పించాలని పేర్కొన్నారు.

తరుణోపాయం

ప్రభుత్వమే ష్యూరిటీ ఇచ్చి బ్యాంకుల నుంచి కాంట్రాక్టర్లకు రుణం

- ఆ నిధులతో రోడ్లు వేయించాలని నిర్ణయం
- రోడ్ల అభివృద్ధికి సరికొత్త టెండరు విధానం
- హెచ్‌ఏఎం తొలి విడతలో పలు ఆర్‌అండ్‌బీ, పీఆర్ రోడ్ల ఎంపిక



26 ఆర్‌అండ్‌బీ రోడ్లకు రూ.523 కోట్లు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: రోడ్ల అభివృద్ధి పనులు చేసేందుకు ఆయా ఇంజనీరింగ్ శాఖలు నూతన టెండరు విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించాయి. ప్రస్తుతం అమలులో ఉన్న విధానం ప్రకారం రోడ్ల పనులకు టెండరు నోటిఫికేషన్ జారీ చేసి..తక్కువకు బిడ్ వేసిన కాంట్రాక్టర్లకు అగ్రిమెంట్ చేసి పనులు చేయించేవారు. పనులు పూర్తయ్యాక బిల్లులు చెల్లించడం ప్రస్తుతం ఉన్న విధానం. అయితే ఈ పనులు చేసిన కాంట్రాక్టర్లకు నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో చాలామంది కాంట్రాక్టర్లు రోడ్ల పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. రోడ్లు భవనాల శాఖలో ఒక్కో పనికి గతంలో పది పర్యాయాలు టెండరు నోటిఫికేషన్ ఇచ్చిన ఘటనలు కూడా ఉన్నాయి. అయినా ఒక్క కాంట్రాక్టర్ కూడా బిడ్ వేయడం లేదు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ కాంట్రాక్టు పనులు చేసేందుకు సాహసించడం లేదు. ఈ సమస్యను అధిగమించేందుకు కొత్తగా హెచ్‌ఏఎం (హైబ్రీడ్ అన్యూటీ మోడ్) అనే విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నూతన విధానం ప్రకారం కాంట్రాక్టర్లకు ఆయా రోడ్డు పనుల అంచనా వ్యయంలో 60% మొత్తానికి ప్రభుత్వమే ష్యూరిటీ ఇచ్చి బ్యాంకుల ద్వారా రుణం ఇప్పిస్తుంది. మిగిలిన 40% మొత్తాన్ని ప్రభుత్వమే సమకూర్చి కాంట్రాక్టరుతో పనులు చేయించాలని నిర్ణయించింది.

- నూతన విధానం హెచ్‌ఏఎం మొదటి విడతలో భాగంగా సంగారెడ్డి జిల్లాలో రోడ్లు భవనాల శాఖకు సంబంధించి 26 రోడ్లను ఎంపిక చేశారు. మొత్తం 387 కి.మీల పొడవున్న ఈ రోడ్ల అభివృద్ధికి సుమారు రూ.523 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు.
- సిద్దిపేట జిల్లాకు 25 రోడ్లను ఎంపిక య్యాయి. రూ.379 కోట్లతో 289 కిలోమీటర్ల మేర రోడ్లను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. మెదక్ జిల్లాకు సంబంధించి సుమారు 18 రోడ్లు ఎంపికైనట్లు సమాచారం.
- ఎంపిక చేసిన రోడ్లలో మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే రహదారులు, అలాగే మండల కేంద్రం నుంచి నేషనల్ హైవే వరకు ఉన్న రోడ్లను అభివృద్ధి చేయాలని భావిస్తున్నారు. మండల కేంద్రం నుంచి మరో మండల కేంద్రానికి ఉన్న రోడ్లు, అలాగే మండల కేంద్రం నుంచి హైదరాబాద్‌కు ఉన్న రహదారులను ఎంపిక చేసినట్లు ఆర్‌అండ్‌బీ పర్యవేక్షక ఇంజనీర్ వసంత్‌నాయక్ 'సాక్షి'తో పేర్కొన్నారు.

పంచాయతీ రాజ్ రోడ్లు సైతం

- ఈ నూతన టెండరు విధానంతో పంచాయతీ రాజ్ రోడ్లను కూడా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. సంగారెడ్డి జిల్లాకు సంబంధించి మొత్తం 105 రోడ్లను ఎంపిక చేశారు. 343 కిలోమీటర్ల పొడవున ఉన్న ఈ రోడ్లను అభివృద్ధి చేయనున్నామని పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజనీర్ జగదీశ్వర్ 'సాక్షి'తో పేర్కొన్నారు.

15 సంవత్సరాల నిర్వహణ బాధ్యతలు

- పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ 30 నెలల్లో పనులు పూర్తి చేయాలి. రోడ్డు నిర్మించిన కాంట్రాక్టర్లకే ఆయా రోడ్ల నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని భావిస్తున్నారు. మొత్తం 15 సంవత్సరాల వరకు ఈ నిర్వహణ సదరు కాంట్రాక్టరే చూసుకోవాలి. రోడ్డు వేసిన ఏడేళ్లకు ఒకసారి బీటీ రెన్యూవల్ చేయాలి. అలాగే 14వ సంవత్సరంలో మరోసారి బీటీ రెన్యూవల్ చేయాల్సి ఉంటుంది.

కాంగ్రెస్ వర్సెస్ బీఆర్‌ఎస్

- రసాభాసగా రేషన్‌కార్డుల పంపిణీ
- హోరెత్తిన నినాదాలు.. ఉద్రిక్తత
- ఇది ప్రజా కార్యక్రమం : ఎమ్మెల్యే సునీతారెడ్డి



చిలప్‌చెడ్‌లో రేషన్ కార్డు అందిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే సునీతారెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీల మధ్య మళ్లీ రగడ రాజుకుంది. మంగళవారం చిలప్‌చెడ్ రైతువేదికలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీతా రెడ్డి, గ్రంథాలయ చైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి, కలెక్టర్ రాహుల్‌రాజ్ హాజరయ్యారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తూ జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేశారు. ప్రతిగా బీఆర్‌ఎస్ నాయకులు సైతం జై బీఆర్‌ఎస్ అంటూ నినాదాలు చేశారు. దీంతో ఆ ప్రాంతం పరస్పర నినాదాలతో హోరెత్తింది. అధికార కార్యక్రమం కాస్త రసాభాసగా మారింది. వైరి వర్గాలు మోహరించడంతో ఉద్రిక్తత నెలకొంది.

కలెక్టర్‌కు ఎమ్మెల్యే కౌంటర్

రేషన్‌కార్డుల అనంతరం జరిగిన సభలో కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు పకడ్బందీగా అమలు చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో 9,941 రేషన్ కార్డులు పంపిణీ చేశామని, కాంగ్రెస్ ప్రభుత్వం తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా అందించిదని వివరించారు. అలాగే రుణమాఫీ, బోనస్ ఇలా అనేక పథకాల గురించి వివరించారు. కలెక్టర్ వాదనను ఎమ్మెల్యే సునీతారెడ్డి సున్నితంగా తిరస్కరించారు. రేషన్ కార్డులు తీసుకునేందుకు కనీసం 10 మంది లబ్ధిదారులు సైతం లేరని ఎద్దేవా చేశారు. కలెక్టర్ తెలిపిన సంక్షేమ పథకాల్లో 60 శాతం కూడా రుణమాఫీ జరగలేదని, రైతులకు మరో రెండు రైతుభరోసాలు ప్రభుత్వం బాకీ ఉందన్నారు. సన్నాలకు బోనస్ లేదని, ఎరువుల కొరత ఎక్కువైందన్నారు. పలు గ్రామాలకు బస్సు సౌకర్యాలు లేక విద్యార్థులు ధర్నాలు చేస్తున్నారని గుర్తు చేశారు. ఇది ప్రజా ప్రభుత్వమని ఏ అధికారైనా, నాయకుడైనా ప్రజల కోసమే పనిచేయాలని చురకలంటించారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

నర్సాపూర్ రూరల్: విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి గిరిజన విద్యార్థులకు సూచించారు. మంగళవారం నర్సాపూర్ మండలం నాగులపల్లి (బంజారా నగర్) జెడ్పీహెచ్ స్కూల్‌కు రూ 3.50 కోట్ల నిధులతో నిర్మించబోతున్న హాస్టల్ భవన నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. అంతకుముందు కేంద్రమంత్రి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. సునీతా రెడ్డి మాట్లాడుతూ.. రుస్తుంపేట శివారులో అసంపూర్తిగా వదిలేసిన గిరిజన బాలికల హాస్టల్ భవనం పూర్తి చేసేందుకు రూ.4 కోట్లు, నర్సాపూర్ నుంచి రుస్తుంపేట, నాగులపల్లి మీదుగా సికిందాలపూర్ రీ బీటింగ్ కోసం రూ 5.70 కోటు, మూసాపేట్ నుంచి దౌల్తాబాద్ వరకు రూ.కోటి, తుజాల్ పూర్, ఖాజీపేట్ రోడ్డుకు రూ .80 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు.

పీఎం, ఎంపీల చిత్రపటాలకు పాలాభిషేకం

నర్సాపూర్ రూరల్ : మండలంలోని నాగులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కేంద్ర ప్రభుత్వం గిరిజన హాస్టల్ మంజూరు చేసినందుకు మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీధర్ యాదవ్, ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్ గౌడ్ బీజేపీ నాయకులతో కలిసి పీఎం మోదీ, మెదక్ ఎంపీ రఘునందన్ రావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

పారదర్శకతతో పనిచేయాలి

రాష్ట్ర ముఖ్య సమాచార కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

మెదక్‌జోన్: ప్రజలకు పారదర్శకంగా, జవాబుదారీతనంతో అధికారులు పనిచేయాలని రాష్ట్ర ముఖ్య సమాచార కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. పౌరసమాచార అధికారులు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేయాలని సూచించారు. సమాచార కమిషనర్లు, పీవీ శ్రీనివాస్, బోరెడ్డి, అయోధ్యరెడ్డి, మోసిన్ పర్వీన్, వైష్ణవి మేర్ల, దేశాల భూపాల్‌లతో కలిసి ఆయన మంగళవారం మెదక్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్ అధ్యక్షతన జిల్లాస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...జిల్లాలో సమాచార హక్కు చట్టం పటిష్టంగా అమలు చేయడంలో కలెక్టర్ తీసుకుంటున్న చొరవ అభినందనీయమన్నారు. రాష్ట్రంలోని 29 ప్రభుత్వ శాఖల్లో 15 శాఖలలో ఎటువంటి కేసులు లేకపోవడం హర్షించదగ్గ పరిణామమని చెప్పారు. గత పదేళ్ల కాలంలో సమాచార కమిషన్ అందుబాటులో ఉంచకపోవడం వల్ల రాష్ట్రంలో 18 వేల కేసులు సమాచార హక్కు చట్టం కమిషన్ దగ్గర పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రజలు సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో సమాచారం అందజేయాలని, ప్రతీ ప్రభుత్వ కార్యాలయాల వద్ద సిటిజన్‌చార్ట్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలో సమాచార హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలయ్యే విధంగా అధికారులకు పలు ఆదేశాలిస్తూ సమావేశాలు నిర్వహిస్తూ, ప్రజలు అడిగిన వెంటనే సమాచారం అందించాలని అధికారులకు ఎప్పటికప్పుడు ఆదేశాలిస్తున్నామన్నారు. అదనపు కలెక్టర్ నగేశ్, అదనపు ఎస్పీ మహేందర్, ఆర్డీఓలు రమాదేవి, మహిపాల్‌రెడ్డి, జయచంద్రారెడ్డితోపాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై దుష్ప్రచారం

బీఆర్‌ఎస్, బీజేపీలపై మంత్రి సీతక్క ధ్వజం



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

చిన్నశంకరంపేట(మెదక్): బీఆర్‌ఎస్ బీజేపీ కుమ్మక్కు రాజకీయాలతోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని మంత్రి సీతక్క ధ్వజమెత్తారు. కామారెడ్డి జిల్లాకు వెళ్తూ మంగళవారం నార్సింగి మండలం జప్తిశివనూర్‌లోని మాజీమంత్రి షబ్బీర్‌అలీ గెస్ట్‌హౌస్‌లో ఆగిన సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే బీఆర్‌ఎస్, బీజేపీ లోపాయికారి ఒప్పందాలతో కాంగ్రెస్‌పై ఎదురుదాడికి దిగుతున్నాయన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీతో కుమ్మక్కవడంతోనే బీఆర్‌ఎస్‌కు ఎక్కడా డిపాజిట్‌లు కూడా రాలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్‌ను బీజేపీలో విలీనం చేస్తామన్నది నిజం కాకపోతే బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ చేసిన వ్యాఖ్యల్ని కేటీఆర్ ఎందుకు ఖండించడంలేదని ప్రశ్నించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలంతా సంతృప్తిగా ఉన్నారని చెప్పారు. మంత్రి వెంట మాజీమంత్రి షబ్బీర్‌అలీ, కామారెడ్డి, బిక్కనూర్ మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ప్రజారోగ్యంపై దృష్టి పెట్టండి

ఆ బాధ్యత వైద్యాధికారులదే: కలెక్టర్

కొల్చారం(నర్సాపూర్): ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించాల్సిన బాధ్యత వైద్యాధికారులు, వైద్య సిబ్బందిదేనని కలెక్టర్ రాహుల్ రాజ్ స్పష్టం చేశారు. మంగళవారం కొల్చారం మండలంలో కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా కొల్చారం పీహెచ్‌సీని సందర్శించారు. ప్రభుత్వ బడులు, హాస్టళ్లలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించే సమయంలో వారి రక్త నమూనాలను సైతం సేకరించాలని కోరారు. విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

ఆగస్టు ఒకటి నుంచి విద్యార్థి అధ్యయన యాత్ర

ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ బాధ్యుడు అజయ్‌కుమార్

మెదక్ కలెక్టరేట్: ఆగస్టు ఒకటి నుంచి 5వ తేదీ వరకు జరిగే విద్యార్థి అధ్యయన యాత్రను విద్యార్థులు జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ బాధ్యుడు అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్నత విద్యను చదువుకోవడానికి ఇతర జిల్లాలకు వలస వెళ్లాల్సి వస్తుందన్నారు. అలాగే జిల్లాలో ఉన్న మెడికల్ కళాశాలకు అధిక సీట్లు పొడిగింపు పెంచాలని డిమాండ్ చేశారు. నూతన ప్రభుత్వ నర్సింగ్ కళాశాలకు సొంత భవనం నిర్మించాలన్నారు. ఇప్పటికే జిల్లాలోని జనరల్ హాస్టల్స్ ఎస్‌ఎంఎస్ హాస్టల్స్ శిథిలా వ్యవస్థలో ఉన్నాయని, కొత్త భవనాలు ఏర్పాటు చేస్తూ విద్యార్థులకు మౌలిక సదుపాయాలు హాస్టల్స్‌లో కల్పించాలన్నారు. విద్యా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి 5 వరకు విద్యార్థి అధ్యయన యాత్రను నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ అదిరే టూర్

దర్శనీయ స్థలాలకు ప్రత్యేక ప్యాకేజీ

- నేటి నుంచి ప్రయాణం
- జిల్లా నుంచి ఆరు క్షేత్రాలకు..



మెదక్ నుంచి టూర్‌కు బయల్దేరుతున్న ప్రయాణికులు

మెదక్ మున్సిపాలిటీ: ప్రజలు విహార యాత్రలకు వెళ్లేందుకు ఎక్కువగా ప్రైవేట్ వాహనాలపైనే ఆసక్తి చూపుతారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ తన వ్యూహం మార్చింది. ప్రయాణికులను ఆకర్షించడంతో పాటు.. సంస్థ ఆదాయం పెంచుకునేందుకు ప్రత్యేక ప్యాకేజీలు ప్రకటించింది. విహార యాత్రలకు బస్సులను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. పుణ్యక్షేత్రాలకు నేరుగా బస్సులు లేకపోవడంతో చాలా మంది ప్రజలు రెండు, మూడు బస్సుల్లో ప్రయాణించి ఇబ్బందులు పడేవారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని పుణ్యక్షేత్రాలకు టూర్ బస్సులను సిద్ధం చేసి నడిపిస్తోంది. ఫలితంగా అటు ఆర్టీసీకి ఆదాయం పెరగడంతోపాటు పుణ్యక్షేత్రాలకు వెళ్లే వారికి సౌకర్యం కలిసొస్తుంది.

జిల్లా నుంచి ప్రత్యేకంగా..

జిల్లాలోని ప్రజలు పుణ్యక్షేత్రాలను దర్శించుకునేందుకు ఆర్టీసీ మంచి అవకాశం కల్పిస్తుంది. దర్శనీయ స్థలాలకు వెళ్లే వారికోసం ప్రత్యేక ప్యాకేజీ ద్వారా టూరు బస్సులు నడిపించేందుకు సంస్థ సిద్ధం చేసింది. ఇందుకోసం ఇప్పటికే ప్రజల నుంచి బుకింగ్‌లు స్వీకరిస్తుంది. ఈనెల 30న మెదక్ ఆర్టీసీ డిపో నుంచి ఆరు పుణ్యక్షేత్రాలకు టూర్ బస్సు బయల్దేరనుంది. ఇందుకోసం బుకింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. ఆర్టీసీ సంస్థ తన ఆదాయ మార్గాల అన్వేషణలో భాగంగా ఈ టూర్ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. మొదటి విడత కొన్ని పుణ్యక్షేత్రాలకు నాలుగు బస్సులు వెళ్లివచ్చాయి.

టూర్ బస్సు వెళ్లే పుణ్యక్షేత్రాలు

సంగారెడ్డి జిల్లా ఝురాసంఘంలోని కేతకి సంగమేశ్వరస్వామి ఆలయం, రేజింత్‌లోని సిద్ధ వినాయక ఆలయం, బీదర్‌లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం, గానుగాపూర్‌లోని శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయం నుంచి పండరిపూర్ రాత్రి అక్కడే ఉండి ఈనెల 31న రెండో రోజు ఉదయం పండరిపురిలో గల శ్రీ విఠలేశ్వర స్వామి ఆలయం, తుల్జాపూర్‌లోని తుల్జావాని మాత దర్శనం చేయిస్తారు. అనంతరం తిరిగి రాత్రి బయలుదేరి మెదక్‌కు చేరుకుంటుంది.

బుకింగ్ కోసం..



భక్తులు పుణ్య క్షేత్రాలకు వెళ్లేందుకు బుక్ చేసుకోవడానికి ఆర్టీసీ సంస్థ 9494825746, 9652577615, 9494947116 నంబర్లను కేటాయించింది. ఇందుకోసం ఫోన్ పే ద్వారా డబ్బులతో బుక్ చేసుకునే అవకాశం కల్పిస్తుంది.

చార్జీలు

పెద్దలకు ఒకరికి రూ.1700, పిల్లలకు రూ.1000 చార్జీ ఉంటుంది. ప్రయాణ సమయంలో ప్రయాణికులు టిఫిన్, భోజనం, దర్శన టికెట్ ఖర్చులు ఎవరికి వారు భరించుకోవాల్సి ఉంటుంది.

ఆదరణ బాగుంది



ఆర్టీసీ నడిపిస్తున్న పుణ్యక్షేత్రాల టూర్ బస్సులకు మంచి ఆదరణ లభిస్తుంది. ఒకే రోజు నాలుగు పుణ్యక్షేత్రాలను దర్శించుకోవచ్చు. జిల్లా నుంచి పుణ్యక్షేత్రాలకు వెళ్లాలనుకునే వారికి అతి తక్కువ ఖర్చుతో ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నాం. భక్తులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. భక్తులు ఆర్టీసీ సూచించిన నంబర్లకు, స్థానిక బస్సు డిపోలో సంప్రదించాలి.

సురేఖ, ఆర్టీసీ డిపో మేనేజర్, మెదక్

ఇప్పటి వరకు ఐదు టూర్లు

మెదక్ ఆర్టీసీ డిపో నుండి మొత్తం ఐదు ట్రిప్పులు టూర్ వెళ్లి వచ్చాయి. అందులో యాదగిరిగుట్టకు నాలుగు బస్సులు, అరుణాచలంకు ఒక బస్సు వెళ్లి వచ్చింది. ఒక్కో బస్సులో 55 ప్రయాణికులను తీసుకెళుతారు.

క్లుప్తంగా

బైండోవర్‌ ఉల్లంఘన.. జరిమానా



రసీదును ఎక్సైజ్‌ ఎస్‌ఐ రూపకు అందజేస్తున్న చంద్రమౌళి

అక్కన్నపేట(హుస్నాబాద్‌): బైండోవర్‌ను ఉల్లంఘించిన వ్యక్తికి జరిమానా విధించారు. ఈ ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎక్సైజ్‌ సీఐ పవన్‌ వివరాల ప్రకారం.. మండలానికి చెందిన భార్యాభర్తలిద్దరూ బింగి శారద, చంద్రమౌళి గతంలో తహసీల్దార్‌ అనంతరెడ్డి ఎదుట బైండోవర్‌ అయ్యారు. కాగా ఇటీవల గుడుంబా తయారీదారులకు బెల్లం, పటికలు సరఫరా చేస్తూ పట్టుబడి బైండోవర్‌ నిబంధనలు ఉల్లంఘించడంతో తహసీల్దార్‌ రూ.50వేల జరిమానా విధించారు. ఎస్‌ఐ దామోదర్‌, రూప తదితరులు ఉన్నారు.

అథ్లెటిక్స్‌లో కృతికి మూడో స్థానం



మెడల్‌తో కృతి

తొగుట(దుబ్బాక): జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌ పోటీల్లో మండలంలోని వెంకట్రావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థిని తగరం కృతి మూడవ స్థానంలో నిలిచింది. మంగళవారం సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన రన్నింగ్‌ సబ్‌ జూనియర్‌ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో కృతికి జ్ఞాపిక, బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, పీఈటీ కనకయ్యలను హెచ్‌ఎం నయీమా కౌసర్‌ అభినందించారు.

వ్యక్తి ఆత్మహత్య

సంగారెడ్డి క్రైమ్‌: ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన పట్టణ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ రమేశ్‌ వివరాల ప్రకారం... పట్టణంలోని భవానీనగర్‌కు చెందిన దేవరొట్టి నవీన్‌కుమార్‌ (35) వృత్తి రీత్యా సీసీ కెమెరాల పని చేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో కుటుంబ సభ్యులు ఎంత పిలిచినా తలుపులు తీయకపోవడంతో పగలగొట్టి లోపలికెళ్లి చూడగా దూలానికి చున్నీతో ఉరేసుకుని కనిపించాడు. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నవోదయకు గడువు పొడిగింపు

వర్గల్‌(గజ్వేల్‌): ఉమ్మడి జిల్లా వర్గల్‌ నవోదయ విద్యాలయంలో 2026–27 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ గడువును ఆగస్టు 13 వరకు పొడిగిస్తూ నవోదయ విద్యాలయ సమితి ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ప్రిన్సిపాల్‌ రాజేందర్‌ ఒక ప్రకటనలో తెలిపారు. గడువు తేదీ మంగళవారంతో ముగిసిందని, విద్యార్థుల ప్రయోజనం కోసం గడువు పొడిగింపు నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి జిల్లా విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో ఆయిల్‌ చోరీ

నర్సాపూర్‌: రెండు ట్రాన్స్‌ఫార్మర్లలో 20లీటర్ల ఆయిల్‌ను దొంగలు చోరీ చేశారు. ఎస్‌ఐ లింగం కథనం ప్రకారం... నర్సాపూర్‌ – తూప్రాన్‌ మార్గంలో హెచ్‌పీ గ్యాస్‌ గోదాం సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌, నారాయణపూర్‌ చౌరస్తా వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్‌లను కింది భాగంలో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి కట్‌ చేసి వాటిలో ఉండే ఆయిల్‌ను చోరీ చేశారు. విద్యుత్‌ శాఖ ఉద్యోగి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

స్వచ్ఛతలో సత్తా చాటేనా?

ఉత్తమ పంచాయతీల గుర్తింపునకు స్వచ్ఛ సర్వేక్షణ్‌ సర్వే

- పల్లెల్లో పర్యటిస్తున్న కేంద్ర బృందం
- జిల్లాలో 20 గ్రామాల ఎంపిక
- దాదాపు పూర్తయిన సర్వే

న్యాల్‌కల్‌(జహీరాబాద్‌): జిల్లాలో ఉత్తమ గ్రామ పంచాయతీలను గుర్తించేందుకు కేంద్ర బృందం సభ్యులు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌ సర్వేలో భాగంగా రోజుకు రెండు గ్రామాల చొప్పున సర్వే నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులతోపాటు మరుగుదొడ్ల వినియోగం, పారిశుద్ధ్యం నిర్వహణ, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ప్రార్థన ప్రదేశాలు తదితర వాటిని వారు పరిశీలిస్తున్నారు. సేకరించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. అయితే ఈసారి స్వచ్ఛతలో గ్రామాలు సత్తా చాటుతాయో? లేదో వేచి చూడాలి.

జిల్లాలో 620 గ్రామ పంచాయతీలున్నాయి. స్వచ్ఛ సర్వేక్షణ్‌ సర్వేలో భాగంగా ఉత్తమ గ్రామ పంచాయతీలను గుర్తించేందుకు 20 గ్రామాలను ఎంపిక చేశారు. ఇప్పటి వరకు వట్‌పల్లి మండలంలోని గొర్రెకల్‌, మర్వెల్లి, పుల్‌కల్‌లోని శివంపేట్‌, వెండికోల్‌, సురెడ్డి ఇటిక్యాల, హత్నూరలోని ఎల్లమ్మగూడ, కొండాపూర్‌లోని మనసన్‌పల్లి, న్యాల్‌కల్‌లోని అమీరాబాద్‌, మొగుడంపల్లి మండలం, కందిలోని ఎద్దుమైలారం, అందోల్‌లోని తాలెల్మ, కల్హేర్‌తోపాటు నిజాంపేట్‌లోని రాంరెడ్డిపేట్‌, మనూర్‌లోని అతిమ్యాల్‌, మనూర్‌, నాగిల్‌గిద్దలోని ముక్తాపూర్‌, కారముంగి, నారాయణఖేడ్‌లోని నాగూర్‌, పగిడిపల్లి గ్రామ పంచాయతీల్లో కేంద్ర బృందం సభ్యులు పర్యటించారు. మొత్తం 20 గ్రామాలకు గాను 19 గ్రామాల్లో పర్యటించగా ఒక గ్రామ పంచాయతీ మాత్రం మున్సిపాలిటీలో కలవడం వల్ల సందర్శించలేదు.

మార్కుల కేటాయింపు ఇలా..	
అంశాలు	మార్కులు
క్షేత్ర స్థాయి పరిశీలన ఆధారంగా	540
మానవ వనరుల వినియోగం	240
వ్యర్థాల నిర్వహణ కేంద్రం	120
ప్రజాభిప్రాయ సేకరణకు	100
మొత్తం 1000 మార్కులు ఉంటాయి.	

ఒక్కో గ్రామంలో 16 ఇళ్లల్లో సర్వే

ఎంపిక చేసిన ఒక్కో గ్రామంలో 16 నివాస గృహలను ఎంచుకొని బృందం సభ్యులు సర్వే చేస్తున్నారు. అందులో మూడు ఎస్సీ, మూడు ఎస్టీ, ఇతర వర్గాలకు చెందిన 10 కుటుంబాలను ఎంపిక చేసుకుని ఆయా ఇళ్లకు వెళ్లి సమాచారం సేకరిస్తున్నారు.

పరిశీలిస్తున్న అంశాలు..

ఎంపిక చేసుకున్న గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి మరుగుదొడ్డి ఉందా? ఉంటే దానిని వినియోగిస్తున్నారా? నల్లా ఉందా, దాని ద్వారా తాగు నీరు సరఫరా అవుతుందా? ఇంకుడు గుంత ఉందా? మురుగు నీరు మురికి కాల్వలోకి వెళ్తుందా? ఇంకుడు గుంతలోకి వెళ్తుందా? అని వివరాలు తెలుసుకుంటున్నారు. అలాగే చెత్త సేకరణ ఎలా జరుగుతుంది? తడి, పొడి చెత్త వేరు చేస్తున్నారా? సేకరించిన చెత్తను ఎక్కడ వేస్తున్నారు? డంపింగ్‌యార్డు ఉందా? ఉపాధిహామీ పథకం పనితీరు, జాబ్‌ కార్డులు ఉన్నాయా?అనే అంశాలను అడుతున్నారు. గ్రామంలో రోడ్లు, తదితర వసతులతో పాటు పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రార్థనాలయాలు సందర్శించి వాటిలో మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, ఉన్నాయా?ఉంటే వాటి నిర్వహణ ఎలా ఉందనే విషయాలను పరిశీలిస్తున్నారు. సేకరించిన సమాచారం ఆధారంగా పంచాయతీలకు మార్కులు కేటాయిస్తారు. వాటి ఆధారంగా ఎంపికైన ఉత్తమ పంచాయతీలకు అవార్డులు అందజేయనున్నారు.



ఆస్పత్రిలో వివరాలు సేకరిస్తున్న కేంద్ర బృందం

పకడ్బందీగా సర్వే



ఎంపిక చేసుకున్న గ్రామాల్లో పకడ్బందీగా సర్వే కొనసాగుతుంది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గ్రామాల్లో పర్యటించి సర్వే నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు 19 గ్రామాల్లో సర్వే పూర్తి కాగా, ఓ గ్రామ పంచాయతీ మున్సిపాలిటీలో విలీనం కావడం వల్ల సర్వే జరగలేదు. సేకరించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు యాప్‌లో పొందుపరుస్తున్నాం. – దొట్టి స్వామి, ఎస్‌బీఐ కో–ఆర్డినేటర్‌, సంగారెడ్డి

స్మార్ట్‌ వాకింగ్‌ స్టిక్‌ ఆవిష్కరణ



ఢిల్లీలో ఆవిష్కరణను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

దుబ్బాకటౌన్‌: ఢిల్లీలో సిద్దిపేట జిల్లా విద్యార్థులు స్మార్ట్‌ వాకింగ్‌ స్టిక్‌ను ఆవిష్కరించి మంగళవారం ప్రదర్శించారని ప్రధానోపాధ్యాయుడు అంజిరెడ్డి తెలిపారు. రాయపోల్‌ మండలం బేగంపేట ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు యం.హర్షవర్ధన్‌, పి.కార్తీక, యం.చైతన్య, గైడ్‌ టీచర్‌ కె.భాస్కర్‌ రెడ్డి మార్గదర్శకత్వంలో 'స్మార్ట్‌ వాకింగ్‌ స్టిక్‌'ను తయారు చేశారని చెప్పారు. స్కూల్‌ ఇన్నోవేషన్‌ మారథాన్‌ –2025లో భాగంగా.. గత డిసెంబర్‌ 2024లో జాతీయ స్థాయిలో లక్షా ఐదువేల వైజ్ఞానిక ప్రాజెక్టులు ఆన్‌లైన్‌లో ప్రదర్శించగా ఉత్తమమైన 27 ఆవిష్కరణలను ప్రకటించారన్నారు. వాటిలో బేగంపేట విద్యార్థుల ఆవిష్కరణ జాతీయ స్థాయికి ఎంపికైందని తెలిపారు. నేటి నుంచి జులై 31 వరకు న్యూ ఢిల్లీలోని గాల్గోటియాస్‌ యూనివర్సిటీలో ప్రదర్శిస్తున్నారని చెప్పారు. కాగా విద్యార్థులను జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌ రెడ్డి, జిల్లా సైన్స్‌ అధికారి శ్రీనివాస్‌, ఉపాధ్యాయులు అభినందించారు.

కాపురం కోసమే అత్తను హతమార్చాడు

- మాట్లాడినట్టు నమ్మించి కత్తితో నరికారు
- అల్లుడు, అతని తమ్ముడు రిమాండ్‌
- వివరాలు వెల్లడించిన ఏసీపీ



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ సదానందం

మద్దూరు(హుస్నాబాద్‌): అత్త చెప్పిన మాటలు విని భార్య కాపురానికి రావడం లేదనే అనుమానంతో అత్తను అల్లుడు, అతడి తమ్ముడు కత్తితో నరికి చంపిన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో హుస్నాబాద్‌ ఏసీపీ సదానందం కేసు వివరాలు వెల్లడించారు. మండలంలోని మర్మాముల గ్రామ శివారులోని బంజేరుకు చెందిన జంగిలి వజ్రమ్మ(55)ను అల్లుడు జక్కుల మహేష్‌, అతడి తమ్ముడు హరీశ్‌తో కలిసి హత్య చేసిన విషయం తెలిసిందే. అత్తను చంపి కాపురం బాగు చేసుకోవచ్చని నిర్ణయించుకుని అన్నదమ్ములిద్దరూ కలిసి కమ్మకత్తి తీసుకొని అత్త గ్రామమైన బంజేరుకు వెళ్లారు. అక్కడ అత్తతో మాట్లాడుతున్నట్లు నమ్మించి మహేశ్‌ కత్తితో నరకగా బలమైన గాయాలై ఆమె అక్కడికక్కడే చనిపోయింది. నిందితులను రిమాండ్‌కు తరలించారు. వారు ఉపయోగించిన కమ్మకత్తితో పాటు ద్విచక్రవాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఆన్‌లైన్‌ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎస్పీ పరితోష్‌ పంకజ్‌



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ పరితోష్‌ పంకజ్‌

జోగిపేట /వట్‌పల్లి (అందోల్‌): బెట్టింగ్‌, ఆన్‌లైన్‌ మోసాలపై అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ పరితోష్‌ పంకజ్‌ పోలీసులకు సూచించారు. ప్రజలు కూడా ఆన్‌లైన్‌ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మంగళవారం జోగిపేట, వట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెండింగ్‌ కేసులకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. అండర్‌ ఇన్వెస్టిగేషన్‌ కేసులు పరిమిత లిమిట్‌లో ఉండాలని, ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా విచారణ చేపట్టాలన్నారు. డయల్‌ 100 కాల్స్‌కు త్వరితగతిన స్పందించాలని, త్వరగా ఘటనా స్థలానికి చేరుకున్నట్లయితే నేరం తీవ్రతను తగ్గించడానికి అవకాశం ఉంటుందన్నారు. నేరాల నియంత్రణ, జరిగిన నేరాలను ఛేదించడానికి ఉపయోగపడే సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించాలని తెలిపారు. దాబాలు, పెట్రోల్‌ పంపులు, విద్యాసంస్థల్లో సీసీలు ఏర్పాటు చేసుకునేలా యాజమాన్యాలకు అవగాహన కల్పించారు.

సైబర్‌ నేరగాళ్ల ముఠా అరెస్ట్‌

వివరాలు వెల్లడించిన సీఐ శ్రీను



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

సిద్దిపేటరూరల్‌: అమాయక ప్రజలను మోసం చేసి సొమ్ము చేసుకుంటున్న సైబర్‌ ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం రూరల్‌ సీఐ శ్రీను స్టేషన్‌లో కేసు వివరాలు వెల్లడించారు. నిజామాబాద్‌ జిల్లా భీమ్‌గల్‌ గ్రామానికి చెందిన చెట్టు మహేష్‌, మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామానికి చెందిన ఎరుకల కావడి అశోక్‌, ఎరుకల గోపి ప్రస్తుతం సిద్దిపేటలోని బాలాజీ నగర్‌లో ఉంటున్నారు. లలిత నగర్‌లో ఉంటున్న ఎరుకల గారడి ప్రశాంత్‌తో కలిసి నలుగురు ముఠాగా ఏర్పడి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ సైబర్‌ నేరాలకు పాల్పడుతున్నారు. కిరాణ దుకాణాలు, వైన్స్‌ షాపులు, పెట్రోల్‌బంకులు, మీసేవా కేంద్రాలు, వ్యాపార సముదాయాల వద్ద అత్యవసరం అంటూ నకిలీ ఫోన్‌పే, గూగుల్‌ పే యాప్‌లతో చెల్లింపులు చేస్తూ డబ్బులు తీసుకుంటున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు నేరస్తులను పట్టుకుని జ్యుడిషియల్‌ రిమాండ్‌కు పంపించారు. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు అలాంటి చర్యలకు పాల్పడితే వెంటనే 100, పోలీస్‌కంట్రోల్‌ రూమ్‌ నెంబర్‌ 8712667100 కు ఫోన్‌ చేయాలన్నారు. విలేకరుల సమావేశంలో రూరల్‌ ఎస్‌ఐ రాజేశ్‌, చిన్నకోడూరు ఎస్‌ఐ సైఫ్‌అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులంలో బైపీసీ, ఎంపీసీకి స్పాట్‌ అడ్మిషన్లు

కొల్చారం(నర్సాపూర్‌): మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల(బాలికలు)కళాశాలలో ఇంటర్‌ ఫస్టియర్‌లో ప్రవేశం కోసం స్పాట్‌ అడ్మిషన్లకు కౌన్సెలింగ్‌ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్‌ సత్యకుమారి తెలిపారు. ఎంపీసీ, బైపీసీలో ఖాళీలు ఉన్నాయని, ఈనెల 31న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు వచ్చిన దరఖాస్తులను మాత్రమే స్వీకరిస్తామన్నారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి దరఖాస్తుల పరిశీలన, మెరిట్‌, రిజర్వేషన్‌ ఆధారంగా ఖాళీలు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. 2025 మార్చిలో ఒకేసారి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు. మీ సేవ ద్వారా పొందిన కుల, ఆదాయ, జనన ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుతోపాటు సమర్పించాలన్నారు. ఆదాయ పరిమితి పట్టణంలో రూ.2 లక్షలలోపు, గ్రామాల్లో రూ.1.50 లక్షలు ఉండాలన్నారు. ఒరిజినల్‌ సర్టిఫికెట్లు, మూడుసెట్ల జిరాక్స్‌, మూడు పాస్‌పోర్ట్‌ సైజ్‌ ఫొటోలతో రావాలని సూచించారు.

ఇళ్లు కడతానని గుల్ల చేశాడు



పోలీసులకు ఫిర్యాదు చేసిన ఇందిరమ్మ లబ్ధిదారులు

- డబ్బులు తీసుకుని కాంట్రాక్టర్‌ పరారీ
- లబోదిబోమన్న ఇందిరమ్మ లబ్ధిదారులు

చిన్నశంకరంపేట(మెదక్‌): ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తానని నమ్మబలికిన కాంట్రాక్టర్‌ లక్షల్లో అడ్వాన్స్‌ తీసుకుని కన్పించకుండా పోయాడు. ఈ ఘటన మండలంలోని మిర్జాపల్లితండాలో చోటుచేసుకుంది. తండాలో ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు జార్కండ్‌కు చెందిన ఎండీ అబ్దుల్‌ యూనస్‌ ముందుకొచ్చాడు. మండలంలోని ఓ పరిశ్రమలో కాంట్రాక్టు పనులు నిర్వహిస్తుండటంతో గిరిజనులు నమ్మి అడ్వాన్స్‌గా లక్ష చొప్పున ఇచ్చి ఒప్పందం చేసుకున్నారు. బేస్‌మెంట్‌ వరకు నిర్మించి బిల్లు వచ్చిన తరువాత మిగితా పనులు చేస్తానన్నాడు. దీంతో ఇందిరమ్మ ఇళ్ల బేస్‌మెంట్‌ బిల్లు రావడంతో మళ్లీ రూ. లక్ష చొప్పున 14 మంది కాంట్రాక్టర్‌కు ఇచ్చారు. మరి కొంత మంది ఇంటి నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని అదనంగా మరో రూ.2 లక్షలు కూడా అందజేశారు. డబ్బులు తీసుకున్న కాంట్రాక్టర్‌ వారం క్రితం ఎవరికీ చెప్పకుండా ఇక్కడి నుంచి ఉడాయించాడు. ఫోన్‌చేస్తే స్విచ్ఛాఫ్‌ వస్తుండటంతో గిరిజనులు అతను నివాసం ఉంటున్న ఇంటికెళ్లి ఆరా తీయగా వారం నుంచి కన్పించడం లేదని చెప్పారు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వసతి గృహాల తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీశ్‌

హవేళిఘణాపూర్‌(మెదక్‌): మండల పరిధిలోని సర్దన, బూర్గుపల్లి గ్రామాల్లోని బాలుర వసతి గృహాలను బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి జగదీశ్‌ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలో ఉన్న విద్యార్థులతో మాట్లాడి వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారితో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించి విద్యార్థులు అనారోగ్యానికి గురి కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వంటగది, భోజనశాల, స్టోర్‌రూమ్‌లను హాస్టల్‌కు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట అసిస్టెంట్‌ బీసీ సంక్షేమ అధికారి గంగకిషన్‌, వసతి గృహ సంక్షేమ అధికారులు ఉమ, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

అర్థమయ్యేలా బోధించాలి

జిల్లా విద్యాశాఖ పరిశీలకులు కృష్ణారావు



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారావు

కొండపాక(గజ్వేల్‌): విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని జిల్లా విద్యాశాఖ పరిశీలకులు, రాష్ట్ర ఎగ్జామినేషనల్‌ డైరెక్టర్‌ కృష్ణారావు ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం కొండపాక మండలంలోని దుద్దెడలో జరుగుతున్న కాంప్లెక్స్‌ సమావేశంలో పాల్గొని ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. అలాగే కొండపాకలోని ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... చిరిగిన చొక్కా అయినా తొడుక్కో.. కానీ ఒక మంచి పుస్తకం కొనుక్కోవాలని విద్యార్థులకు సూచించారు. గ్రంథాలయంలో విలువైన పుస్తకాలుంటాయని, వాటిని చదువడం వల్ల మేథోసంపత్తి పెరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండేలా, పుస్తక పఠనం చేసేలా ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌వో రంగనాథస్వామి, సీఆర్‌సీ హెచ్‌ఎం లక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ హైస్కూల్‌ శిలాఫలకం ఆవిష్కరణ



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఈఓ సునీత తదితరులు

వర్గల్‌(గజ్వేల్‌): పీఎంశ్రీ పాఠశాలలు దేశానికి అంకితంలో భాగంగా మంగళవారం భారత విద్యా శాఖ నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా నుంచి వర్గల్‌ పీఎంశ్రీ జెడ్పీహైస్కూల్‌ వర్చువల్‌ పద్ధతిలో పాల్గొన్నది. ఐఎఫ్‌పీ ప్యానెల్స్‌ ద్వారా ఈ కార్యక్రమాన్ని మండల విద్యాధికారి సునీత, ఏపీసీ చైర్మన్‌ భవాని, ఇన్‌చార్జి హెచ్‌ఎం సుధారాణి, ఏఈ అరవింద్‌, కాంప్లెక్స్‌ ఉపాధ్యాయులు, విద్యార్థులు వీక్షించారు. ఈ సందర్భంగా 'పీఎంశ్రీ జెడ్పీహెచ్‌ఎస్‌ వర్గల్‌' శిలాఫలకాన్ని ఎంఈఓ సునీత ఆవిష్కరించారు. పీఎంశ్రీ స్కూల్‌ కావడంతో పాఠశాలకు కంప్యూటర్లు, సంగీత పరికరాలు, ఆట వస్తువులు, సైన్స్‌ ల్యాబ్‌, తరగతి గదులు తదితర అనేక హంగులు సమకూరుతున్నాయని పేర్కొన్నారు. ఇవి విద్యావికాసానికి బాటలు వేస్తాయని తెలిపారు.

అథ్లెటిక్స్‌తో ఉజ్వల భవిష్యత్‌



మాట్లాడుతున్న అధ్యక్షుడు పరమేశ్వర్‌

సిద్దిపేటజోన్‌: అథ్లెటిక్స్‌తో ఉజ్వల భవిష్యత్తు ఉందని ఆ సంఘం జిల్లా అసోసియేషన్‌ అధ్యక్షుడు పరమేశ్వర్‌ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లా అథ్లెటిక్స్‌ పోటీలు ప్రారంభించారు. అండర్‌ 8,10,12, 14,16,18,20 ఓపెన్‌ విభాగాల్లో బాలబాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 320మంది క్రీడాకారులు హాజరయ్యారు. వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రీడా సమాఖ్య చైర్మన్‌ సాయిరాం, అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి వెంకట్‌ స్వామి, క్రీడాకారులు పాల్గొన్నారు.

పప్పు ధాన్యాల సాగు.. ఆశాజనకం

- ఖరీఫ్‌ పంటలకు జీవం పోసిన వర్షాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

జహీరాబాద్‌ టౌన్‌: పప్పు ధాన్యాల సాగు ఆశాజనకంగా ఉండటంతో రైతులు దిగుబడిపై ఆశలు పెట్టుకున్నారు. పప్పుధాన్యాల కొరతపై అవగాహన ఉన్న అన్నదాతలు కంది, సోయాబీన్‌, పెసర, మినుము పంటలను సాగు చేస్తున్నారు. నైరుతి రుతు పవనాల కారణంగా మే నెలలో వర్షాలు కురిశాయి. అదే సమయంలో రైతులు ఖరీఫ్‌ పంటల సాగుకు శ్రీకారం చుట్టారు. అయితే జూన్‌లో వరుణుడు ముఖం చాటేయడంతో ఆందోళన చెందారు. పంటలను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడ్డారు. జులైలో ఓ మోస్తారు వానలు కురవడంతో పంటలకు ప్రాణం పోసినట్లయింది. దీంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

జహీరాబాద్‌ వ్యవసాయశాఖ డివిజన్‌లో జహీరాబాద్‌, మొగుడంపల్లి, కోహీర్‌, ఝరాసంగం, న్యాల్‌కల్‌ మండలాలు ఉన్నాయి. ప్రాజెక్టులు, చెరువులు లేనందున ఆయా మండలాల్లో వర్షధార పంటలను అధిక విస్తీర్ణంలో రైతులు పండిస్తుంటారు. ప్రధానంగా పత్తి, కంది, మొక్కజొన్న, జొన్న, పెసర, మినుము, సోయాబీన్‌ పంటలను సాగు చేస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది లక్షల ఎకరాల్లో వానాకాలం పంటలను సాగు చేశారు. సుమారు 3 లక్షల ఎకరాల్లో పత్తి, 65 వేల ఎకరాల్లో సోయాబీన్‌,70 వేల ఎకరాల్లో కంది, 7,500 ఎకరాల్లో మినుము, 14వేల ఎకరాల్లో పెసర, 7వేల ఎకరాల్లో మొక్కజొన్న వేశారు. ప్రస్తుతం కురుస్తున్న వానలు పంటలకు జీవం పోస్తున్నాయి. వ్యవసాయశాఖ అధికారులు గ్రామాలను సందర్శించి పంటలను పరిశీలిస్తున్నారు.



హద్నూర్‌లో సాగు చేస్తున్న సోయాబీన్‌ పంట

జోరుగా కలుపుతీత పనులు

పంట పొలాల్లో పెరుగుతున్న కలుపు రైతులకు కంటి మీద కునుకులేకుండా చేస్తుంది. ఆయా పంట చేన్లు ఎదుగుదల దశలో ఉన్నాయి. కలుపు కూడా అదే స్థాయిలో పెరిగిపోతుంది. కూలీల కొరత వల్ల అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. స్థానికంగా కూలీలు అందుబాటులో లేకపోవడంతో ఆటో చార్జీలిచ్చి మరి ఇతర గ్రామాల నుంచి తీసుకు వస్తున్నారు. ఎకరాకు రూ.6 నుంచి 8 వేల వరకు కూలీలు తీసుకుంటున్నారు. కలుపుతీత పనులు తలకుమించిన భారంగా మారాయని అన్నదాతలు వాపోతున్నారు.

అధికారుల సూచనలు పాటించాలి



ఖరీఫ్‌ పంటలు ప్రస్తుతం ఆశాజనకంగా ఉన్నాయి. ఈ సంవత్సరం పంటలకు అనుకూలంగా వానలు పడుతున్నాయి. పంటల సాగులో ఎరువుల వాడకం, సస్యరక్షణ చర్యలు తదితర తెగుళ్ల నివారణకు రైతులు అధికారుల సూచనలు పాటించాలి. –భిక్షపతి, ఏడీఏ, జహీరాబాద్‌